# టెర్రర్

- మల్లాది వెంకటకృష్ణమూర్తి.




అతీంద్రియ శక్తులని, క్షుద్ర విద్యలని నేనెన్నడూ నమ్మేవాడిని కాదు. కాని ఈ సంఘటన నా నమ్మకాలన్నిటినీ కుదిపేసింది. దెయ్యాల కథలు ఇష్టపడే ధైర్యవంతులు తప్ప, బేలమనస్కులు, హాస్యప్రియులు దయచేసి ఈ కథని చదవవద్దని, అది హార్ట్ అటాక్‌కి దారితీయవచ్చునని ముందుగా మనవి.

మా ఆవిడ వేసవి సెలవులకి పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దాంతో ఒంటరిగా ఇంట్లో ఉండడం బోర్ అనిపించి నేను మదీనాగూడాలోని నా మిత్రుడి ఇంటికి ఓ శనివారం ఆఫీసునించి వెళ్లాను.

మా ఇద్దరి అభిరుచులు ఒకటే కాబట్టి ఆ రాత్రి బీర్‌తో వచ్చాడు. కబుర్లతో సరదాగా కాలక్షేపం చేశాను. ఆదివారం కాలేజీ కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరం కలిసి వండుకున్నాం.

మధ్యాహ్నం ఛిల్డ్ కౌన్ట్ బీర్ తాగి పడుకున్నాం. సాయంత్రం ఇద్దరం కలసి బి.హెచ్.ఇ.ఎల్. దగ్గరున్న ఓ థియేటర్‌లో ఆడే మాయాబజార్‌ని చూద్దామని ప్లాన్ చేసుకున్నాం. ఆ థియేటర్ నాసిరకందే అయినా, ఆ సినిమా మీద మోజుతో దానికి సెకండ్ షోకి వెళ్లాలనుకున్నాం.

అయితే దురదృష్టవశాత్తూ నా మిత్రుడి బావగారు వచ్చారు. ఆ రాత్రికి వాడి దగ్గరే వుండి, మర్నాడు కోర్టు పని చూసుకోడానికి గన్నవరం నించి వచ్చాడు. ఆయన మాతో సినిమాకి రావడానికి ఇష్టపడకపోగా, మావాణ్ణి తన స్కూటర్ మీద అమీర్‌పేట్‌లోని లాయర్ ఇంటికి తీసుకెళ్లమని కోరాడు. చేసేదిలేక నేనొక్కడ్నే ఆ సినిమాకి ఫస్ట్ షోకి వెళ్లాను.

సినిమా అయ్యాక హోటల్ భోజనం చేసి కాసేపు అటూ ఇటూ 'కలర్'ని చూస్తూ తిరిగి, ఆఖరి సిటీ బస్సు ఎక్కి మదీనాగూడా స్టాప్‌లో దిగాను.

మెయిన్‌రోడ్ నుంచి కిలోమీటర్ దూరంలో వుంటుంది మదీనాగూడా. ఆ కాలనీకి డబుల్ రోడ్డు ఉన్నా వీధి దీపాలు ఉండవు.

దాంతో రాత్రి పదకొండున్నరకి ఒంటరిగా కాలనీ వైపు నడవసాగాను. ఆ రాత్రి కాస్తంత భయంకరంగా అనిపించింది. నాకెందుకో చీకట్లో ఏవో కదులుతున్న భావన. చెవులకి భయంకర నిశ్శబ్ద సంగీతం వినిపిస్తున్న ఫీలింగ్. మధ్యలో ఆగి చూశాను, తోడుగా ఎవరైనా వస్తున్నారా అని. లేదు. చిత్రంగా ఎవరో నా వెనకాలే నడుస్తున్న భావన కలుగుతోంది. నే చదివిన 'తులసీదళం' గుర్తుకువచ్చి భయం వేసింది. నా మిత్రుడి బావ రాకపోతే వాడి స్కూటర్ మీద వెళ్లేవాళ్లం కదా! అనుకుంటూ నడక వేగం పెంచాను.

అకస్మాత్తుగా రోడ్డు పక్కన గుప్పున కాంతి కనిపించింది. నల్లటి బట్ట మీద పరచిన చిన్న లాంతరు వెలుగులో కనిపించాడతను.

చూడగానే నా రోమాలు నిక్కబొడుచుకునేలా ఉందతని ఆకారం. నల్లటి ముఖం, తెల్లటి జడలు కట్టిన జుట్టు భుజాల మీంచి వేలాడుతోంది. ఎర్రటి కళ్లు, దిగంబరుడు. మెడనించి భుజాలమీదుగా ఛాతీ మీదకి ఆరెంజ్ రంగు బట్ట తప్ప ఒంటిమీద ఇంకే ఆచ్ఛాదనా లేదు.

లాంతరు వున్న ఆ నల్లబట్ట మీద తెల్లటి మానవ కపాలాల బొమ్మలు ముద్రించి వున్నాయి. దానిమీద ఎర్ర అట్టలు గల సన్నటి పుస్తకాలు దొంతరగా ఉన్నాయి.

అతను నా వంక చూసి చెప్పాడు–

"కొడుకా, ఓ పుస్తకం నా దగ్గర కొనచ్చుగా?" ఆయన కంఠధ్వనిలో భయంగొల్పే కర్కశత్వం.

"ఏం పుస్తకాలివి?" అడిగాను నా భయాన్ని దాచుకుంటూ.

"చేతబడి చేయడం ఎలా అని. చక్కటి గైడ్. ఇది చదివితే చేతబడి చేయొచ్చు. చేసిన దాన్ని తిప్పికొట్టొచ్చు"

నేను నా జీవితాంతం చింతించే పొరపాటు చేశాను.

"ఒకోటి ఎంతంకుల్?" అడిగానాయన్ని.

"అయిదు వందల రూపాయలే"

"అబ్బో! చాలా ఖరీదు"

ఆయన నా వంక చూసిన చూపులోని క్రోధాన్ని గమనించి వెంటనే జేబులు తడుముకున్నాను. కొన్ని నోట్లు బయటకి వచ్చాయి.

"నా దగ్గర వుంది రెండు వందల రూపాయలే"– బ్రతిమాలుతున్నట్లుగా చెప్పాను.

"సరే, నీకాధరకే అమ్ముతాను"

నా చేతిలోని డబ్బు తీసుకుని అతను నాకో పుస్తకం ఇస్తుంటే, అతని చేతులు శవం చేతుల్లా ఎంతో చల్లగా జివ్వున తగిలాయి.

నేను గబగబా కాలనీ వైపు అదిరే గుండెలతో నడుస్తుండగా వెనకనించి ఆయన కంఠం వినిపించింది.

"కొడకా, ఏం జరిగినా సరే. నువ్వెప్పుడూ ఆ పుస్తకంలోని ఆఖరి పేజీ మాత్రం చూడక. చూస్తే నీకు హార్ట్ అటాక్ రావచ్చు"

నేనేం జవాబు చెప్పకుండా పరుగులాంటి నడకతో కాలనీలోకి వచ్చి పడ్డాను.

నా మిత్రుడు, అతని బావ సి.డి.లో శ్రీ కృష్ణార్జున యుద్ధం చూస్తున్నారు; వాళ్లని చూశాక నా ప్రాణం కుదుటపడింది.

నా ముఖంలోని భయాన్ని గ్రహించి అడిగాడు నా మిత్రుడు–

"ఏం జరిగింది?"

"మీ కాలనీలో పాత పుస్తకాలు అమ్మే ముసలాయన ఎవరైనా ఉన్నారా?" అడిగాను.

"లేదు. కానీ అమావాస్య రాత్రి మాత్రం దెయ్యంలా కనిపించే ఓ ముసలివిడ కొందరు పాదచారులకి కనబడిందని మా పనిమనిషి అనేకసార్లు చెప్పింది. ఏం?"

"ఏం లేదు"

నా మిత్రుడి బావగారు ఊరికే చెవులకి తాటాకులు కట్టే రకం కాబట్టి నేనా విషయం అతనికి వివరించలేదు. నేనా రాత్రి పక్క మీదకి చేరేసరికి గోడ గడియారం సరిగ్గా పన్నెండు కొడుతోంది.

పుస్తకం అందుకోగానే నాకు ఆ ముసలాయన హెచ్చరిక గుర్తుకు వచ్చింది. దాన్ని పక్కన పడేశాను. కిటికీలోంచి అకస్మాత్తుగా చల్లటి గాలితెర ఒకటి గదిలోకి వేగంగా ప్రవేశించింది. ఆ గాలికి ఆ ముసలాయన దగ్గర కొన్న పుస్తకం కాగితాలు రెపరెపలాడాయి. నేనా పుస్తకం వంక చూస్తే సరిగ్గా ఆఖరి పేజీనే తెరచుకుని వుంది.

రాజుగారి కొడుకుతో పేదరాసి పెద్దమ్మ ఉత్తరం వైపు గదిలోకి వెళ్లొద్దంటే, అతను అందులోకి వెళ్లేదాకా ఊరుకోలేకపోయిన కథ మనకందరికీ తెలిసిందే.

ఇది నాలాంటి అనవసరపు కుతూహల మనస్తత్వం గల వాళ్లకి అద్దం పడుతుంది.

నేను ఆఖరి పేజీని దీక్షగా చూసి, వెంటనే గట్టిగా అరిచి మూర్ఛపోయాను. నా కేక విని వచ్చిన నా మిత్రుడు నా మొహాన చన్నీళ్లు కొడితే కాని తిరిగి స్పృహలోకి రాలేదు. వణికే మనసుతో, ఆఖరి పేజీలో ఏం వుందో ఇంకోసారి చూశాను.

బుక్ ఫర్ సేల్...

ఒరిజినల్ ప్రైస్ - రూ.20/-

ప్రమోషన్ ప్రైస్ - రూ.10/-